క్లుప్తంగా

మద్యం విక్రయిస్తే శిక్ష తప్పదు



అక్రమ మద్యం అమ్మకందారులను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఈబీ సీఐ బృందం

బల్లికురవ: మద్యం అక్రమ అమ్మకాలు చేపడితే కేసు నమోదుతో జైలు శిక్ష తప్పదని అద్దంకి ఎస్‌ఈబీ ఇన్‌చార్జి సీఐ కె. శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం బల్లికురవ బస్టాండ్‌లో మద్యం అక్రమ అమ్మకాలు చేపడుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన చల్లగుండ్ల నాగేశ్వరరావు, బ్రహ్మయ్య, లిక్కర్ బాటిళ్లు అమ్ముతుండగా 18 బాటిళ్లను స్వాధీన పరచుకున్నారు. అద్దంకి కోర్టుకు హాజరపరచగా దర్శి సబ్‌జైలుకు 14 రోజులు రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో విస్తృత సేవలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

చినగంజాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.నాగేంద్ర అన్నారు. బుధవారం మోటుపల్లి పంచాయతీ పరిధిలోని అడివిధిపాలెంలో 104 సిబ్బంది ఆధ్వర్యంలో 85 మందికి వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 104 మెడికల్ ఆఫీసర్ పి.శరత్‌చంద్ర, ఎంపీహెచ్ జీవి ప్రసన్న, డీఈఓ పాదిలి రాఘవ, ఏఎన్‌ఎంలు సునీతా, కావ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

క్వారీలో నిబంధనలు పాటించాలి



క్వారీలో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో సరోజిని

బల్లికురవ: క్వారీలో భద్రతా చర్యలతోపాటు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని చీరాల ఆర్డీవో సరోజిని అన్నారు. బుధవారం కొణిదెన రెవెన్యూలోని సర్వే నంబర్ 1023, 1024లో 3.4 హెక్టార్లకు కెబీ స్టోన్స్ ఏర్పాటుకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. హద్దులకు లోబడి పనులు చేయించారు. దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలని కోరారు. తహసీల్దార్ పి. సీతారత్నం, పర్యావరణ పరిరక్షణ ఈఈ నాగిరెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన రెండు గృహాలు



ఇంటిలో కాలిపోయిన వస్తువులు

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ పరిధిలోని దేవన మార్కెండేయులు, ప్రసాదరావుకు చెందిన రెండు పెంకుటిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటి యజమానులు జాండ్ర పేటలో జరుగుతున్న చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవాలకు ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. అదే సమయంలో ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇంటి లోపల ఉన్న చేనేత మగ్గాలు, బట్టలు వంట సామగ్రి దగ్ధమయ్యాయి. స్థానికులు చీరాల అగ్నిమాక శాఖ వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

మౌలిక వసతులపై వీడియో కాన్ఫరెన్స్



కొరిశపాడులో వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న మండల అధికారులు

మేదరమెట్ల: మిషన్ అంత్యోదయ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, కావాల్సిన పనుల గురించి తెలియపరచేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొరిశపాడు, అద్దంకి మండలాలకు చెందిన అధికారులు కొరిశపాడు మండల కార్యాలయంలో బుధవారం పాల్గొన్నారు. ఈఏడాది రెండు మండలాల్లోని గ్రామాల్లో ఇప్పటి వరకు చేసిన పనులు, వాటి పురోగతిపై చర్చించారు. అద్దంకి, కొరిశపాడు ఎంపీడీవోలు ప్రద్యుమ్నకుమార్, సురేష్‌బాబు, ఈవోఆర్‌డీలు వెంకట్రావు, దుర్గ, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య



ధ్వజస్తంభ నిర్మాణ పూజల్లో పాల్గొన్న కృష్ణ చైతన్య

అద్దంకి: వైఎస్సార్ సీపీ గృహసారథులు, కన్వీనర్లు తమ విధులు, బాధ్యతలను గుర్తెరిగి పనిచేయాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. పట్టణ, మండల పరిధిలోని గృహసారథులు, కన్వీనర్లకు రెండు దఫాలుగా బుధవారం శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు ఆరిమండ వరప్రసాద్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, వివిధ హోదాల్లోని నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని పురాతన దేవాలయమైన కాళికాసమేత సమేత కమఠేశ్వరస్వామి దేవస్థాన ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, నియోజకవర్గ పరిశీలకుడు ఆరిమండ వరప్రసాద్‌పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ధ్వజస్తంభానికి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక నాయకులు సందిరెడ్డి రమేష్, కాకాని రాధాకృష్ణ, చెన్నుపల్లి శ్రీవివాసచారి, అనంతు మురళీ రామ్మోహన రావు, పొన్నపల్లి బ్రహ్మానందం, గుండెమెడ రామ్మోహనరావు, మల్లిఖార్జున పాల్గొన్నారు.

పంట కోసం..



ముప్పవరంలో మొక్కజొన్న పైరు చుట్టూ కట్టిన చీరలు

జె.పంగులూరు: మొక్కజొన్న పంట పంగులూరు మండలంలో ఆశాజనకంగా ఉంది. అయితే అడవి పందులు, నక్కలు నుంచి పంటను కాపాడుకునేందుకు గతంలో పొలం చుట్టూ కరెంటు తీగలు పెట్టేవాళ్లు, డబ్బాలతో కొన్ని శబ్దాలు చేస్తూ వాటిని రాకుండా పైరును కాపాడుకునేవాళ్లు. అయితే ఇప్పుడు పొలం చుట్టూ రకరకాల రంగుల్లో ఉండే చీరలు కడుతున్నారు. వీటిని చూసి అడవి పందులు, నక్కలు రాకుండా ఉంటాయన్నారు. పంగులూరు మండలంలో సుమారు 4600 ఎకరాల్లో ఈ సంవత్సరం రబీ సీజన్‌లో మొక్కజొన్న పైరు సాగు చేస్తున్నారు. ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు. దీన్ని అవకాశంగా చేసుకొని చీరలు అమ్మేవాళ్ళు ధరలను పెంచారు. ఒక్కో చీర రూ. 25 నుంచి 30 వరకు ధర పలుకుతోంది. గతంలో రూ. 15కు ఇచ్చేవారని రైతులు తెలిపారు. ఎకరాకు 100 నుంచి 110 చీరలు వరకు అవసరం అవుతుంది. అంటే ఎకరాకు సుమారు రూ. 3 వేల రూపాయలు వరకు ఈ చేరలకే ఖర్చు అవుతుందని తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి



స్వర్ణలో డాక్టర్ రిత్వికావాసు దంపతులను సత్కరిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ ఉద్యోగులు తమ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాలిని అన్నారు. ఇప్పటి వరకు కారంచేడు మండలంలో 104 వాహన వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ ఈ నెలాఖరులో రిలీవ్ అవుతున్న డాక్టర్ రిత్వికవాసు దంపతులను పీహెచ్‌సీ, 104 సిబ్బంది ఘనంగా సత్కరించారు. బుధవారం మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శాలిని మాట్లాడుతూ వృత్తిని గౌరవించి, బాధ్యతగా పనిచేసే వారిని ప్రజలు, తోటి సిబ్బంది ఎప్పుడు హృదయంలో ఉంచుకుంటారన్నారు. అలా పనిచేసే వారిలో డాక్టర్ రిత్వికావాసు ప్రథమ స్థానంలో ఉంటారన్నారు. ఈ ప్రాంతంలో పనిచేసిన కాలంలో తోటి సిబ్బంది, 104 వాహన సిబ్బందితోనే కాకుండా ఫీల్డులో ప్రజలతో ఆమె ప్రేమగా మాట్లాడి వైద్య సేవలందించారన్నారు. ఆమె ఎక్కడ పనిచేసినా ఆయా ప్రాంతాల ప్రజలతో మమేకవుతూ ప్రజలకు మంచి వైద్య సేవలందించాలని ఆకాంక్షించారు. డాక్టర్ రిత్వికవాసు మాట్లాడుతూ కారంచేడు మండలంలో పనిచేసినంత కాలంలో ఎంతో అనుభవాన్ని సొంత చేసుకున్నానన్నారు. ప్రజలు కూడా తనను ఎంతో ప్రేమగా చేశారని చెప్పారు. సిబ్బందితో ఉన్న సాని మర్చిపోలేనన్నారు. డాక్టర్ హష్మప్రియ, లాలూప్రసాద్, హెచ్‌ఈ మీనాకుమారి, ఎల్టీ బయ్యా శంకర్, శాంతిలత, బాల, క్షీరవర్ధిని, మల్లీశ్వరి, అనూష, నూర్జహాన్, అశ్విని, నాగలక్ష్మి, సౌజన్య, శారధ, వేమమణమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: పట్టణంలోని 33 కేవీ ఫీడర్ రైల్వే పనుల వలన దండుబాటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జయంతిపేట, ఉజిలిపేట, విఠల్‌నగర్, వైకుంఠపురం ప్రాంతాల్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చీరాల డీఈ టి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోటప్పకొండకు 45 బస్సులు

చీరాల అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు చీరాల ఆర్టీసీ డిపో నుంచి 45 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల బుధవారం తెలిపారు. కోటప్పకొండకు టిక్కెట్ ధర రూ.100 ఉంటుందన్నారు. గత సంవత్సరం నిర్దేశించిన టిక్కెట్ ధర ఈ సంవత్సరం కూడా ఉంచామన్నారు.

టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్



సారా తయారీకి ఉపయోగించే పదార్థాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చీరాల: చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదినారాయణపురం, రాంనగర్, రైల్వేట్రాక్, ఆర్టీసీ గ్యారేజ్ తదితర ప్రాంతాల్లో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ సోమశేఖర్, ఎక్సైజ్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. 200 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే పదార్థాలను గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. టూటౌన్ ఎస్సై సురేష్, చంద్రావతి, 70 మంది సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు



బల్లికురవలో మాట్లాడుతున్న పేరయ్య, స్థానిక నేతలు

బల్లికురవ: జలజీవన్ మిషన్‌లో రూ. 45 లక్షలతో వేమవరం గ్రామ సమీపంలోని ఊర చెరువును అభివృద్ధి చేస్తుంటే ఎల్లో మీడియా, ప్రతి పక్షాల వారు ఆక్రమించు కుంటున్నారంటూ తప్పుడు కథనాలు ప్రచురించారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చింతలపేరయ్య, స్థానిక నేతలు ధ్వజమెత్తారు. బుధవారం బల్లికురవలో విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వేమవరం గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 52లో 58 ఎకారల్లో చెరువును వైఎస్సార్‌సీపీ నేతలు ఆక్రమించు కుంటున్నారంటూ తప్పుడు కథనాలు ప్రచురించారన్నారు. ఎంతోకాలంగా 30 ఎకరాలను 60 మంది రైతులు సాగు చేసుకుంటున్నారని.. అయితే దీనిపై రెవెన్యూ అధికారులు కోర్టులో కేసులు వేయటంతో సాగు భూములు బీడు భూములయ్యాయని పేరయ్య అన్నారు. ఇప్పుడు అక్కడ చిల్ల చెట్లు మొలిచి చిట్టడవిలా తయారైందని.. కాగా కోర్టు వివాదంలో లేని 28 ఎకరాలను అభివృద్ధి పరుస్తుంటే తప్పుడు ప్రచారంతో అడ్డుకున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే సర్వే కొలతలతో అభివృద్ధి పరుస్తామని చెప్పారు. చింతల శ్రీనివాసరావు, షేక్ శ్రీనువలి, వేమవరం రైతులు పాల్గొన్నారు.

ఐటీసీ ద్వారా విద్యాభివృద్ధికి సహకారం



భూమి పూజ చేస్తున్న ఐటీసీ ఫైనాన్స్ మేనేజర్ నిరంజన్

వేటపాలెం: ఐటీసీ ద్వారా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చీరాల ఐటీసీ ఫైనాన్స్ మేనేజర్ ఎల్. నిరంజన్ తెలిపారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో ఐటీసీ మిషన్ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం కోసం బుధవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ బీబీహెచ్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల సౌకర్యార్థం ఐటీసీ బంగార భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రూ. 10 లక్షలు నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో పాఠశాలలు, 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం వివిధ రకాల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఐటీసీ హెచ్‌ఆర్ మేనేజర్ సీజే విజయలక్ష్మి, బంగారు భవిష్యత్తు ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్, కళాశాల కార్యదర్శి బండ్ల శరత్‌బాబు, జాయింట్ సెక్రటరీ కొసనం నాగమాంబ, కోడూరి ఏకాంబేశ్వర బాబు, లేళ్ల కృష్ణమూర్తి, విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి. బాలసుబ్రహ్మణ్యం, రాజశేఖర్‌రావు, ధర్మారావు పాల్గొన్నారు.

రక్తహీనత నిర్మూలనే ధ్యేయం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తూ గర్భిణీలు, చిన్నారులు కిశోర బాలికలకు రక్త హీనత లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ బాపట్ల డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ తెలిపారు. బుధవారం గుంటుపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా కాన్పుల గది, ల్యాబ్ సర్వీసులు, మందులు, ఓపీ, ప్రభుత్వ పరంగా అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. ఓపీని పెంచాలన్నారు. అనీమియా, ముక్త భారత్ ద్వారా గర్భిణులకు తొమ్మిది నెలల పాటు, చిన్నారులకు 42 రోజుల పాటు, పీఎన్‌సీ చెకప్‌తో ఆరోగ్యాన్ని సంరక్షించాలని ఆదేశించారు. అనుమోల్ యాప్‌తో బాలింతలు, గర్భిణీలు చిన్నారుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. వైద్యశాలలో రెండో వైద్యుడు, స్టాఫ్ నర్సు పోస్టు, సిబ్బందిని త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. స్టాఫ్ నర్సులకు బదులు ఎంఎల్‌హెచ్‌పీలను డిప్యూటేషన్‌పై నియమించనున్నట్లు చెప్పారు. కొప్పరపాడుకు రెండో పీహెచ్‌సీ మంజూరైనట్లు వెల్లడించారు. గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రకాశ్‌రావు సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఆయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవల పీహెచ్‌సీ మంత్రి విడదల రజిని పీహెచ్‌సీని సందర్శించి ఆయన్ను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో బుధవారం విచారణ చేపట్టినట్లు డీఎంహెచ్‌ఓ విజయమ్మ తెలిపారు. వైద్యాధికారి రమీజ్ అహ్మద్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



జరుబులవారిపాలెంలో విద్యార్థులతో ఎంఈఓ

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వంగా ఉండవద్దని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంఈఓ ఎంవీ సత్యాన్నారాయణ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జరుబులవారిపాలెం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ సమయపాలన పాటించడంతో పాటు, అసెంబ్లీ నిర్వహించుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం తరగతులను నిర్వహించాలని చెప్పారు. మంచి పోషక విలువలుండే ఆహారం అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కాంప్లెక్స్ చైర్మన్ చెంచుపున్నయ్య, హెచ్‌ఎం అనంతపద్మనాగులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌తో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి అనిల్‌కుమార్

ముండ్లమూరు: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్లోరోసిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి వేము అనిల్‌కుమార్ అన్నారు. చింతలపూడి, ముండ్లమూరు, పెద ఉల్లగల్లులో బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఫ్లోరోసిస్ బారిన పడి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం పలు రకాల యంత్రాలను అందజేస్తామని తెలిపారు. నడుముకు కట్టుకునే బెల్ట్, నడక కర్ర, వీల్ చైర్ ఉచితంగా అందిస్తామని చెప్పారు. అనంతరం ఫ్లోరోసిస్ పరీక్షలు చేశారు. ముండ్లమూరు వైద్యాధికారి వి. జ్యోతి, సీహెచ్‌ఓ నారాయణరావు, హెల్త్ విజిటర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

ఉగాది లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



గృహ నిర్మాణాల ప్రగతి గురించి తెలసుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు

చినగంజాం: మండలంలోని జగనన్న కాలనీల్లో పేదలకు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను ఉగాది లోగా పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక గ్రూపుల ద్వారా గృహనిర్మాణ లబ్ధిదారులకు ఇచ్చే రూ.35 వేలు రుణాలను లబ్ధిదారులకు కాకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఇచ్చి నిర్మాణాలను త్వరితగతిన పూరయ్యేలా చూడాలన్నారు. బేస్‌మెంట్ లెవల్ కూడా రాని 462 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి నిర్మాణాలు మెదలుపెట్టేలా చూడాలని చెప్పారు. 15 రోజుల్లోగా నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయికి తెచ్చేలా స్థానిక అధికారులు చొరవ చూపాలన్నారు. ఉగాది నాటికి గృహప్రవేశాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. హౌసింగ్ పీడీ ప్రసాద్‌రావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, హౌసింగ్ డీఈ యురళి, ఏఈ రాజశేఖర్, ఏపీఎం అంజిబాబు, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఓఏలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రోశయ్య

అద్దంకి: వివిధ రకాల దుకాణాలకు సరుకులు, వస్తువులు చేరవేసే వాహనాల అన్‌లోడింగ్ వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ రోశయ్య అన్నారు. అన్‌లోడింగ్ చేసుకోవాలనే రూల్‌ను పెడుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో దుకాణదారులకు బుధవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కిరాణా, వస్త్ర, హోల్‌సేల్, రిటైల్, సిమెంటు, ఇనుముతోపాటు, ఇతర దుకాణాలకు లారీల ద్వారా వచ్చే సరుకులను నిర్ణీత సమయాల్లోనే అన్‌లోడ్ చేయించుకోవాలని చెప్పారు. ఉదయం 7.30 గంటల్లోపు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు రాత్రి 8.30 గంటల తరువాత అన్‌లోడ్ చేయించుకోవాలన్నారు. ఇదంతా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసేందుకు మాత్రమే అన్నారు. దుకాణదారులు సహకరించి మార్గదర్శకాలను పాటించాలని చెప్పారు. మునిసిపల్ కమిషనర్ టి. రవికుమార్ మాట్లాడుతూ పట్టణలో ఎటువంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు అధికారులు చెప్పిన విధంగా ముందుకు సాగాలన్నారు. అయితే ఈ నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని, ఆ లోగా ఆయా సమయాల్లో అన్‌లోడ్ చేసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులు సీఐతో చెప్పారు. మార్చి నెల ఒకటో తేదీ నుంచి చెప్పిన వేళల్లోనే అన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

పర్చూరు: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో పర్చూరు సిబ్బంది వారిచే సీజ్ అయిన వాహనాలను వేలం వేయనున్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో నెల్లూరు వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్ పర్చూరులో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎస్‌ఈబీ సీఐ యశోదరాదేవి బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

వలల వివాదంపై సమావేశం



మాట్లాడుతున్న మత్స్య శాఖ అధికారులు

చీరాల అర్బన్: చీరాల మండలం వాడరేవు సముద్రతీరం వద్ద చేపల వేటకు ఉపయోగించే వల విషయంలో ఇతర గ్రామాల మత్స్యకారుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు బుధవారం మత్స్యశాఖ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. మత్స్య శాఖ ఏడీ కృష్ణకోషోర్ మాట్లాడుతూ మత్స్యకారుల వేటకు సంబంధించిన వలల నిబంధనలు, ఏపీ ఎంఎఫ్‌ఆర్ 1995 చట్టం గురించి వివరించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ సముద్రతీరంలో గ్రామాల మత్స్యకారులంతా కలిసి వేట చేసుకుంటూ సమస్యలు రాకుండా చూసుకుంటామన్నారు. సమావేశంలో కారంచేడు ఎఫ్‌డీఓ రాజకుమార్, ఈపూపుపాలెం ఎస్సై జనార్ధన్, మత్స్యకారుల యూనియన్ ప్రెసిడెంట్ గొల్లపోతు నాగార్జున, వాడరేవు యాంత్రిక పడవల యూనియన్ ప్రెసిడెంట్ నక్కా శ్రీనుపాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ఉపాధి హమీ పథకంలో గ్రామాల వారీగా కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. బుధవారం గుంటుపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. రోజుకు 5 గంటలకు తగ్గకుండా కూలీల చేత పనులు చేయించాలని అప్పుడే రూ. 300 వరకు కూలి వస్తుందని చెప్పారు. ఎండల దృష్ట్యా ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరాలన్నారు.

తుప్ప తెగులు నివారణకు చర్యలు



శనగ పైరును పరిశీలిస్తున్న ఏవో

తాళ్లూరు: పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి పూట మంచు కారణంగా అనను కూల పరిస్థితుల్లో శనగలో తెగుళ్ల ప్రభావం ఉంటుందని, తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. మల్కాపురం, రజానగరంలో శనగ పైరును బుధవారం పరిశీలించారు. శనగలో వచ్చు తుప్పు తెగులు నివారణ చర్యలను సూచించారు. సర్పంచ్ షేక్ వలి, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

సైకిల్‌తో ఆరోగ్యం పదిలం

చినగంజాం: మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ సైకిల్ తొక్కాలని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు కీర్తిసరోజ్, వి.నాగేంద్ర సూచించారు. ఆయుష్మాన్‌భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సంతరావూరులో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. కాన్సర్ నివారణ కోసం సైకిలింగ్ ఫర్ హెల్త్ అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఎంపీ, యూపీ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ జి. విజయప్రసన్న, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.